# పారదర్శకంగా సమగ్ర సర్వే

- ప్రభుత్వ నిబంధనలు పాటించాలి
- ప్రజలు ఎన్యుమరేటర్లకు పూర్తి సమాచారం ఇవ్వాలి



నారాయణఖేడ్: సర్వేను పరిశీలిస్తున్న ఆర్డీఓ అశోక చక్రవర్తి

**నారాయణఖేడ్:** ప్రభుత్వం చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వేను పారదర్శకంగా నిర్వహించాలని నారాయణఖేడ్ ఆర్డీఓ అశోక చక్రవర్తి పేర్కొన్నారు. నాగల్‌గిద్ద మండలంలోని మోర్గి గ్రామంలో చేపట్టిన సర్వేను ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎన్యుమరేటర్లు, ప్రజలతో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం సూచించిన విధంగా సర్వే నమూనాను కచ్చితంగా పాటిస్తూ ఇంటింటికీ తిరిగి సర్వే చేపట్టాలన్నారు. ఆయన వెంట డిప్యూటీ తహసీల్దార్ శివకృష్ణ, సూపర్‌వైజర్ రవీందర్ ఉన్నారు.

**సర్వేకు ప్రజలు సహకరించాలి**

**మునిపల్లి(అందోల్):** సర్వేకు ప్రజలు సహకరించి పూర్తి వివరాలు తెలియజేయాలని ఎంపీడీఓ హరినందన్‌రావు కోరారు. ఆదివారం మండలంలోని బుదేరాలో కులగణన సర్వే కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఎన్యుమనేటర్లు కుటుంబ సభ్యులు చెప్పే సమాధానాలు ఓపికతో విని సర్వే ఫాంలో సక్రమంగా నమోదు చేయాలన్నారు.

**పూర్తి వివరాల సేకరణ**

**సంగారెడ్డి టౌన్ :** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కుటుంబ, ఆర్థిక, రాజకీయ సర్వేను సక్రమంగా నిర్వహించాలని సంగారెడ్డి ఎంపీడీఓ యాదగిరి అన్నారు. ఆదివారం మండలంలోని పలు గ్రామాల్లో సర్వే నిర్వహణను పరిశీలించారు. సర్వే చేస్తున్న ఎన్యుమరేటర్లకు పూర్తి సమాచారం అందించాలన్నారు. ఇందుకు ప్రజలు సహకరించాలని కోరారు. ఈనెల 18వ తేదీ వరకు గ్రామంలోని ప్రతి కుటుంబానికి సంబంధించిన పూర్తి వివరాలను సర్వేలో పొందుపరుచుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, మండలాధికారులు పాల్గొన్నారు.



సంగారెడ్డి టౌన్: ఫసల్వాదిలో..



సదాశివపేట పట్టణంలో..

**సర్వేను పరిశీలించిన ఆర్డీఓ**

**సదాశివపేట(సంగారెడ్డి):** సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే బాధ్యతగా చేపట్టాలని సంగారెడ్డి ఆర్డీఓ రవీందర్‌రెడ్డి సర్వే సిబ్బందికి సూచించారు. ఆదివారం పట్టణంలో కొనసాగుతున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను ఆర్డీఓ రవీందర్‌రెడ్డి పరిశీలించారు. ఇంటికి వెళ్లి సర్వే ఫారం పరిశీలించి, సూచనలు చేశారు, సర్వేపై ప్రజలకు ఏమైనా సందేహాలుంటే తక్షణమే నివృత్తి చేయాలన్నారు, ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా సర్వేను ప్రభుత్వ మార్గదర్శకాలను పాటిస్తూ ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సరస్వతీ, సర్వే సిబ్బంది పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### వాహనాల తనిఖీ



డాగ్‌స్క్వాడ్‌తో వాహనాలను తనిఖీ చేస్తున్న సీఐ తదితరులు

**న్యాల్‌కల్(జహీరాబాద్):** మండలంలోని ముంగి చౌరస్తా వద్ద ఆదివారం సాయంత్రం పోలీసులు వాహనాలను తనిఖీలు నిర్వహించారు. జిల్లా ఎస్పీ రూపేష్ ఆదేశాల మేరకు జహీరాబాద్ రూరల్ సీఐ బిడెకన్నె హన్మంత్ ఆధ్వర్యంలో హద్నూర్, ఝరాసంగం, రాయికోడ్ పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు. సంగారెడ్డి నుంచి ప్రత్యేక వాహనంలో వచ్చిన డాగ్ స్క్వాడ్ ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేసింది. ఈ సందర్భంగా సీఐ హన్మంత్ మాట్లాడుతూ.. ప్రభుత్వం నిషేధించిన గంజాయి, పొగాకు ఉత్పత్తులు తంబాకు, గుట్కాలను తరలిస్తే కఠిన చర్యలు తప్పవని వాహన చోదకులను హెచ్చరించారు. కార్యక్రమంలో హద్నూర్, ఝరాసంగం ఎస్ఐలు రాజశేఖర్, నరేష్ ఆయా పోలీస్ స్టేషన్‌ల సిబ్బంది సుధాకర్, సంగమేష్, రమేష్ పాల్గొన్నారు.

### పోలింగ్ కేంద్రం సందర్శన



బీఎల్‌ఓలతో మాట్లాడుతున్న ఆర్డీఓ రవీందర్ రెడ్డి

**సదాశివపేట రూరల్(సంగారెడ్డి):** ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో భాగంగా మండలంలోని నందికంది పోలింగ్ కేంద్రాన్ని ఆదివారం సంగారెడ్డి ఆర్డీఓ రవీందర్‌రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా బీఎల్‌ఓలకు పలు సూచనలు చేశారు. ప్రతి బీఎల్‌ఓ విధిగా నూతన ఓటరు నమోదు, మార్పులు, చేర్పులు నమోదు చేయాలని ఆదేశించారు. 18 ఏళ్లు నిండిన వారికి ఓటుహక్కు కల్పించడంతో పాటు చనిపోయినా వారి పేర్లను తొలగించాలన్నారు. పేర్లు, ఊర్లు, నియోజకవర్గాలు, ఇతర మార్పులు, చేర్పులు చేసుకోవచ్చని ఓటర్లకు సూచించారు. కొత్తగా ఓటుహక్కు పొందే వారు పోలింగ్ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆయన వెంట తహసీల్దార్ సరస్వతి, ఆర్ఐ అనంతయ్య, బీఎల్‌ఓలు విజయలక్ష్మి, గీత, సునీత పాల్గొన్నారు.

### కవి నారాయణకు అవార్డు ప్రదానం



అవార్డు అందజేస్తున్న ఆచార్య శ్రీనివాస్‌రావు తదితరులు

**జహీరాబాద్ టౌన్:** జహీరాబాద్‌కు చెందిన కవి, రచయిత డాక్టర్ పెద్దగొల్ల నారాయణకు ఏపీలోని ఆదికవి నన్నయ్య విశ్వవిద్యాలయం వారు అవార్డును ప్రదానం చేశారు. రాజమండ్రిలోని విశ్వవిద్యాలయం సెమినార్ హాల్‌లో జరిగిన కవి సమ్మేళనంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ×విలువలను కోల్పోతున్నాం? అనే శీర్షికన కవిత గానం చేశారు. ఈ మేరకు విశ్వవిద్యాలయ ఉప కులపతి ఆచార్య వై.శ్రీనివాస్‌రావు ఆయనను సన్మానించి, అవార్డు ప్రదానం చేసి ప్రశంసా పత్రం అందజేశారు. కార్యక్రమంలో 150 మంది కవులు, ప్రిన్సిపాల్ జ్యోతిర్మయి, తెలుగు సంచాలకులు డాక్టర్ తర్లపాటి సత్యనారాయణ, రిజిస్టర్ డాక్టర్ సుధాకర్, కళావేదిక అధ్యక్షుడు డాక్టర్ కత్తిమండ ప్రతాప్ పాల్గొన్నారు.

### కేతకీలో ప్రత్యేక పూజలు



పూజలు చేసిన డీఐజీ సుమతి, తదితరులు

**ఝరాసంగం(జహీరాబాద్):** దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన కేతకీ సంగమేశ్వర ఆలయంలో ఆదివారం ఉమెన్స్ సేఫ్టీ రాష్ట్ర డీఐజీ సుమతి(ఐపీఎస్) కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. వారికి ఆలయ మర్యాదలు పూర్ణకుంభంతో ఘనంగా స్వాగతం పలికారు. గర్భగుడిలోని పార్వతీపరమేశ్వరులకు అభిషేకం, కుంకుమార్చన, మహామంగళహారతి పూజలు చేశారు. అనతంరం ఆలయ అర్చకులు స్వామివారి తీర్థ ప్రసాదాలు అందించి, పూలమాలలు, శాలువాతో సన్మానించారు. కేతకీ ఆలయం కార్తీక శోభను సంతరించుకుంది. కార్తిక మాసం పురస్కరించుకని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యాతో తరలివచ్చారు. ఆలయ ఆవరణలో దీపాలను వెలిగించి, మొక్కులు చెల్లించుకున్నారు.

### భక్తి భావనతో మానసిక ప్రశాంతత



పూజలు చేస్తున్న మాధవానంద సరస్వతీ స్వామి

**సంగారెడ్డి టౌన్ :** భక్తి భావనతో మానసిక ప్రశాంతత లభిస్తోందని మాధవానంద సరస్వతీ అన్నారు. ఆదివారం పట్టణంలోని హనుమాన్ ఆలయంలో పంచలక్ష పుష్పార్చన నిర్వహించారు. మాధవానంద సరస్వతీ స్వామి వారి ప్రత్యక్ష పర్యవేక్షణలో, ఆలయ కమిటీ అధ్యక్షుడు నాయికోటి రామప్ప ఆధ్వర్యంలో వేద పండితుల వేద మంత్రోచ్చారణల మధ్య ఐదు వందల మంది భక్తులు సామూహిక పుష్పార్చన నిర్వహించారు.

### నేడు సీసీఐ కేంద్రాలు బంద్

**మునిపల్లి(అందోల్):** సీసీఐ కేంద్రాలను ఈ నెల 11న (సోమవారం) బంద్ చేయనున్నట్లు రాయికోడ్ మార్కెట్ కమిటీ చైర్మన్ మంతూర్ సుధాకర్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రస్థాయి సమ్మె కారణంగా పత్తి కొనుగోలు కేంద్రాలు బంద్ ఉంటాయన్నారు. రైతులు సీసీఐ కేంద్రాలకు పత్తిని తీసుకుపోవద్దని సూచించారు.

# పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఉపాధ్యాయులను సన్మానించిన పూర్వ విద్యార్థులు

**జిన్నారం (పటాన్‌చెరు):** పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా నిర్వహించారు. జిన్నారం మండలం చెట్ల పోతారం జిల్లా పరిషత్ పాఠశాల 2009–10 బ్యాచ్ చదివిన పూర్వ విద్యార్థులు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను పుష్పగుచ్ఛాలు అందజేసి ఆహ్వానించి, శాలువాతో సన్మానించారు. పూర్వ విద్యార్థులు అప్పటి తీపి జ్ఞాపకాలను గుర్తు వేసుకుని సంతోషంగా గడిపారు. ప్రస్తుతం వివిధ రంగాల్లో ఎదిగిన తమ విద్యార్థులను చూసి ఉపాధ్యాయులు గర్వపడ్డారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు హనుమంతరావు, పెంచలయ్య, అనిత, సువర్ణ, రత్న కిషోర్, పరిమళ, సురేందర్ రెడ్డి, రవీందర్ రెడ్డి, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

# ఓటరు నమోదు పరిశీలన



ఓటరు నమోదు కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్

**జిన్నారం (పటాన్‌చెరు):** గుమ్మడిదల మండలంలో రాష్ట్ర ఎన్నికల అధికారుల ఆదేశాల మేరకు రెండు రోజుల పాటు నిర్వహించిన ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని తహసీల్దార్ గంగాభవాని ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు ఓటరుగా నమోదు చేయించుకోవాలన్నారు. సంబంధిత పోలింగ్ కేంద్రాల వద్ద లేదా ఆన్‌లైన్‌లో ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. అదే విధంగా నూతన ఓటర్ల నమోదుతో పాటు, మార్పులు చేర్పులు చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో బీఎల్‌ఓలు, దరఖాస్తుదారులు పాల్గొన్నారు.

# ప్రతిభతో గుర్తింపు పొందాలి

- డీఐజీ సుమతి



బహుమతులను ప్రదానం చేస్తున్న డీఐజీ సుమతి

**జహీరాబాద్ టౌన్:** ఆడపిల్లలు.. అన్నింటా తెగువ చూపాలని, అప్పుడే జీవితంలో రాణిస్తామని రాష్ట్ర డీఐజీ సుమతి అన్నారు. పట్టణంలోని ఆర్‌ఎల్‌ఆర్ స్కూల్ ఆవరణలో చిల్డ్రన్స్ ఫెస్ట్ కమిటీ, గ్రామిక్ విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో ఆదివారం పిల్లల పండగ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఆడపిల్లలు పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో ప్రతిభ చూపుతున్నారని, ఇందుకు నేనే ఉదాహరణని చెప్పారు. ఎన్ని కష్టాలు ఎదురైనా విజయమే లక్ష్యంగా ముందుకెళ్లాలన్నారు. ఏ రంగమైన ప్రతి భ చాటుతూ గుర్తింపు పొందాలన్నారు. మహిళలు, చిన్నారులపై లైంగిక వేధింపులు. ప్రేమ పేరిట మోసాలు చోటు చేసుకుంటున్నాయన్నారు. విద్యతో అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించవచ్చన్నారు. అనంతరం విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో కన్వీనర్ డాక్టర్.విజయలక్ష్మి, గ్రామిక్ విజ్ఞాన కేంద్రం మేనేజింగ్ ట్రస్టీ బి.రాంచందర్, కోశాధికారి మహిపాల్, డాక్టర్ శివబాబు, శ్రీనివాస్, స్కూల్ ప్రిన్సిపాల్ కవిత పాల్గొన్నారు.

### ఎస్‌బీఐ బ్యాంకును ఏర్పాటు చేయండి

**జిన్నారం (పటాన్‌చెరు):** జిన్నారం మండల కేంద్రంలో ఎస్‌బీఐ బ్యాంకును ఏర్పాటు చేయాలని మాజీ వార్డు సభ్యుడు శ్రీనివాస్ యాదవ్ అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. మండలంలోని వినియోగదారులు లావాదేవీలకు బ్యాంకును ఏర్పాటు చేయాలని ప్రతిపాదన ఎప్పటినుంచో ఉందన్నారు. వ్యాపార లావాదేవీలు, రైతులకు సంబంధించిన లావాదేవీలు మండలంలో ఎక్కువగా కొనసాగుతాయని అధికారులు వీటన్నిటిని పరిశీలించి జిన్నారంలో బ్యాంక్ ఏర్పాటు దిశగా చర్యలు చేపట్టాలని కోరారు. బ్యాంకు ఏర్పాటుపై ఇప్పటికే పలుమార్లు విజ్ఞప్తులు చేశామన్నారు. మండలంలో ఎస్‌బీఐ బ్యాంకు లేనందున గుమ్మడిదల అన్నారం గండి మైసమ్మ ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. ఇప్పటికైనా అధికారులు చొరవ తీసుకొని బ్యాంకు ఏర్పాటు దిశగా కృషి చేయాలన్నారు.

### క్వింటాల్‌కు 2కిలోల తరుగు



వరి కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన సీపీఎం నాయికులు

**నారాయణఖేడ్:** వరి కొనుగోలు కేంద్రాల్లో క్వింటాల్‌కు రెండు కిలోల తరుగు తీస్తున్నారని సీపీఎం నారాయణఖేడ్ ఏరియా కార్యదర్శి నల్లవల్లి రమేష్ ఆరోపించారు. మండలంలోని సంజీవన్‌రావుపేట్‌లోని వరి కొనుగోలు కేంద్రాన్ని ఆదివారం పరిశీలించి, రైతులతో మాట్లాడారు. తరుగు పేరుతో అధికంగా తీస్తున్నారని, రైతులే హమాలీలకు రూ.45లు క్వింటాల్‌కు ఇవ్వాల్సి వస్తుందన్నారు. ప్రభుత్వమే భరించాలన్నారు. ప్రభుత్వం దొడ్డు వడ్లకు కూడా బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఖేడ్ నియోజకవర్గంలోని కొన్ని గ్రామాల్లో అధికంగా వరి పంట సాగు చేస్తారని తెలిపారు. రైతులు పండించిన సన్నరకం వడ్లకు క్వింటాలుకు రూ.2,320లు చెల్లిస్తూ, రూ.500 బోనస్ రైతుల ఖాతాల్లో జమ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు సతీష్, అర్జున్, మహిపాల్ పాల్గొన్నారు.

# పొగాకు ఆరోగ్యానికి హానికరం



ప్రతిజ్ఞ చేయిస్తున్న విష్ణువర్ధన్‌రెడ్డి

**నారాయణఖేడ్:** పొగాకు ఆరోగ్యానికి హానికరమని పొగాకు నియంత్రణ విభాగం జిల్లా సూపర్‌వైజర్ విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. జాతీయ పొగాకు నియంత్రణలో భాగంగా నారాయణఖేడ్ రాజీవ్‌చౌక్, బస్టాండ్ పరిసరాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ప్రతి ఒక్కరూ పొగాకు వల్ల కలిగే నష్టాల గురించి తెలుసుకోవాలన్నారు. బీడీ, చుట్ట, సిగరేట్, జర్దా, తంబాకు, పాన్‌మసాలా లాంటివి వినియోగించొద్దని చెప్పారు. వీటి వాడకంతో హైపర్‌టెన్షన్, నోటి క్యాన్సర్, శ్వాసకోస, గుండె సంబంధిత వ్యాధులు సంక్రమించే అవకాశం ఉందన్నారు. బహిరంగ ప్రదేశాల్లో ధూమపానం చేస్తే రూ.200 జరిమానా విధిస్తామన్నారు. విద్యాలయాల చుట్టూ పొగాకు ఉత్పత్తుల అమ్మకం నిషేధమని, ఎవరైనా అమ్మితే జరిమానా విధిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది భోజయ్య, రవికుమార్, ఇసాక్ పాల్గొన్నారు.



ది ఆదర్శ కోఆపరేటివ్ అర్బన్ 25వ శాఖను నారాయణఖేడ్‌లో ఆదివారం ఎమ్మెల్యే సంజీవరెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారు. కార్యక్రమంలో చైర్మన్ మదన గోపాలస్వామి, మున్సిపల్ చైర్మన్ తాహీర్, వార్డు కౌన్సిలర్ సద్దాం తదితరులు పాల్గొన్నారు.
–నారాయణఖేడ్

# ఘనంగా సదర్ ఉత్సవాలు



సదర్ ఉత్సవాల్లో పాల్గొన్న గోవర్ధన్ రెడ్డి



ఉత్సవాల్లో పాల్గొన్న డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్ తదితరులు

**జిన్నారం (పటాన్‌చెరు):** గుమ్మడిదల మండలంలోని యాదవ సంఘం ఆధ్వర్యంలో శనివారం రాత్రి సదర్ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఉత్సవాలకు స్థానిక సీజీఆర్ ట్రస్ట్ చైర్మన్ చిమ్ముల గోవర్ధన్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా యాదవ సంఘం సభ్యులతో కలిసి శ్రీకృష్ణుడి విగ్రహానికి జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం దున్నపోతుల విన్యాసాలను ఆయన వీక్షించారు. అనంతరం గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ.. సదర్ ఉత్సవాలు యాదవుల ఐక్యతను చాటుతాయన్నారు. ప్రతి ఏటా మండలంలో యాదవ సోదరులు సదర్ సమ్మేళనం నిర్వహిస్తుండటం ప్రత్యేకతను సంతరించుకుందన్నారు. విభిన్న తరహాలో ముస్తాబు చేసిన దున్నపోతుల విన్యాసాలు స్థానికులను విశేషంగా ఆకట్టుకున్నాయి. నిర్వాహకులు, నాయకులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో యాదవ సంఘం సోదరులు నిర్వాహకులు స్థానికులు పాల్గొన్నారు.

**జహీరాబాద్ టౌన్‌లో..**

**జహీరాబాద్ టౌన్:** పట్టణంలో గొల్ల కురుమ, యాదవ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం సదర్ ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. దున్నపోతుతో సదర్ విన్యాసాలు చేయించారు. వీటి విన్యాసాలు ప్రజలను ఆకట్టుకున్నాయి. ఉమ్మడి మెదక్ జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ ఎం.శివకుమార్, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు తట్టు నారాయణ, సొసైటీ చైర్మన్ మచ్చేందర్, బీఆర్ఎస్ నాయకులు నామరవికిరణ్, గుండప్ప, విజయ్‌కుమార్, రమేష్ యాదవ్, పాండు, పవన్, మల్లు పాల్గొన్నారు.

**నేడు న్యాల్‌కల్‌లో..**

**న్యాల్‌కల్(జహీరాబాద్):** మండల కేంద్రంలో న్యాల్‌కల్‌లో సోమవారం సదర్ ఉత్సవాలు నిర్వహించనున్నారు. మొట్ట మొదటిసారిగా నిర్వహించే ఉత్సవాలకు నిర్వాహకులు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేశారు. గొల్ల, కుర్మ, యాదవ సంఘం నాయకులు దత్తు, పండరి యాదవ్‌ల ఆధ్వర్యంలో ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఉత్సవాలకు సంబంధించిన కరపత్రాలను నిర్వాహకులు మండలంలోని వివిధ గ్రామాలతో పాటు రాయికోడ్, ఝరాసంగం, జహీరాబాద్, మనూర్ తదితర మండలాల్లో పెద్ద ఎత్తున పంపిణీ చేశారు. ఉత్సవాల్లో దున్నపోతులను ప్రత్యేకంగా అలంకరించి గ్రామంలో ఊరేగింపు నిర్వహించడం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమానికి ప్రజా ప్రతినిధులు, సంఘాల పెద్దలు హాజరవుతున్నట్లు తెలిపారు.



కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేస్తున్న నాయకులు

## సంక్షిప్త వార్తలు

### ముత్తంగిలో హనుమాన్ చాలీసా



**పటాన్‌చెరు:** మండలంలోని ముత్తంగి గ్రామం, దత్తాత్రేయ కాలనీలో హనుమాన్ దేవాలయంలో ఆదివారం భజరంగ్ దళ్ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. కార్యక్రమంలో వివేకానంద సేవ సమితి జిల్లా అధ్యక్షుడు శేషాద్రి, న్యాయవాది నాగరాజు యాదవ్, భజరంగ్ దళ్ జిల్లా నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

### బసవన్న మార్గం అనుసరణీయం



**జహీరాబాద్ టౌన్:** విశ్వగురువు బసవేశ్వరుడు చూపిన మార్గాన్ని అనుసరించాలని పలువురు వక్తలు అన్నారు. పట్టణంలోని నాగులకట్ట వద్ద ఉన్న అనుభవ మండపంలో ఆదివారం బసవజ్యోతి కార్యక్రమాన్ని నిర్వహించి సామూహిక ప్రార్థనలు చేశారు. లింగాయత్ సమాజ్ అధ్యక్షుడు రాజశేఖర్ షెట్కార్, సంఘం నాయకులు, అక్కన బళగ సభ్యులు, బసవ భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పలువురు వక్తలు మాట్లాడుతూ.. సమాజంలోని ప్రజలంతా సమానులేనని, బసవేశ్వరుడు 12వ శతాబ్దంలో బోధించి ఆచరణలో పెట్టారని చెప్పారు. ఈ సందర్భంగా రెవెన్యూ శాఖలో విధులు నిర్వహించి, పదవీ విరమణ పొందిన ప్రభాకర్ దంపతులను సమాజం సభ్యులు సన్మానించారు.

### విద్యుదాఘాతంతో గేదె మృతి



**నారాయణఖేడ్:** నిజాంపేట మండలం బాచేపల్లికి చెందిన రైతు గుగులోత్ కిషన్‌నాయక్‌కు చెందిన పాడిగేదె ఆదివారం విద్యుదాఘాతంతో మృతి చెందింది. రోజూలాగే గేదెను చేనులో మేపుతుండగా బోరు మోటారు కనెక్షన్‌కు ఉన్న విద్యుత్తు తీగను తాకడంతో షాక్ కొట్టి అక్కడికక్కడే మృతి చెందిందని బాధిత రైతు తెలిపాడు. దాని విలువ రూ.80 వేల ఉంటుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని కోరాడు.

### బ్యాడ్మింటన్ పోటీలు

**జహీరాబాద్ టౌన్:** పట్టణంలో డిఆరేనా స్పోర్ట్స్ జోన్ ఆధ్వర్యంలో ఆదివారం బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించారు. ఫైనల్ డబుల్ పోటీల్లో సతీష్, ఓంకార్ వర్సెస్ జైపాల్, డేనియల్ జోడీలు పోటీపడ్డాయి. సతీష్ జోడి విజయం సాధించింది. విజేతలకు నిర్వాహకులు బహుమతులు ప్రదానం చేశారు. క్రీడలతో మానసికోల్లాసం, ఆరోగ్యంగా ఉంటారని అన్నారు.

### ఆకట్టుకున్న క్లాసికల్ డ్యాన్స్




**సదాశివపేట(సంగారెడ్డి):** జహీరాబాద్‌లోని ఆర్‌ఎల్ఆర్ పాఠశాలలో ఆదివారం పిల్లల పండుగ ఘనంగా నిర్వహించారు. సదాశివపేట నాట్యశిల్పి డ్యాన్స్ అకాడమీ నృత్య కళాకారులు జూనియర్ క్లాసికల్ నృత్య ప్రదర్శనకు నక్షిత అండ్ టీం ప్రథమ బహుమతి పొందారు. సమన్వయకర్తలుగా భాగ్యరేఖ, బబిత, యూసుఫ్‌లు వ్యవహరించారు. ప్రథమ బహుమతి రావడం సంతోషంగా ఉందని నక్షిత టీం సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు.